మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 118 | బుధవారం | 15 - 10 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## విశాఖను ఏఐ హబ్‌గా మార్చే చారిత్రాత్మక ఒప్పందం



2లో..




# విశాఖను ఏఐ హబ్‌గా మార్చే చారిత్రాత్మక ఒప్పందం

- విశాఖలో ఆసియాలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు
- రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడితో గూగుల్ మెగా ప్రాజెక్ట్
- కేంద్ర, రాష్ట్ర కీలక నాయకుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న గూగుల్
- ఎక్స్‌లో హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా ట్రెండింగ్



మన గళం, అమరావతి : టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త మైలురాయి చేరినట్లైంది. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్, విశాఖపట్నంలో భారీ స్థాయి ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే, విశాఖ భారతదేశ ఏఐ మ్యాప్‌లో మాత్రమే కాక ఆసియా స్థాయిలో కీలక టెక్ డెస్టినేషన్‌గా నిలిచే అవకాశం ఏర్పడింది. ఈ డేటా సెంటర్ కోసం సుమారు రూ. 1.33 లక్షల కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. పెట్టుబడి పరంగా ఇది రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద టెక్నాలజీ ఒప్పందంగా భావిస్తున్నారు. డేటా ప్రాసెసింగ్, క్లౌడ్ సర్వీసులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధిత అంతర్జాతీయ సేవలకు ఇది ప్రధాన కేంద్రంగా ఉండనుంది. ఢిల్లీలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ ప్రత్యక్షంగా హాజరై ప్రాజెక్టు దిశగా ఉన్న సంస్థ ప్రణాళికలను వివరించారు. ఈ హాజరు ప్రాజెక్టుపై కేంద్ర–రాష్ట్ర సంయుక్త నిబద్ధతను సూచిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ కనెక్టివిటీ పెరిగి, స్టార్టప్స్, టెక్ ఇన్నోవేషన్‌కు ఊతం లభించనుందని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. ఏఐ ఆధారిత కొత్త సేవలు, ఇన్నోవేటివ్ ప్రాజెక్టులకు విశాఖ కేంద్రంగా మారే అవకాశాన్ని యువత గొప్ప ఆశగా చూస్తోంది. టెక్ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా భారీగా పెరుగుతాయని అంచనాలు వెల్లువెత్తుతున్నాయి సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా టాప్ ట్రెండింగ్‌లో నిలిచింది. గూగుల్ పెట్టుబడితో రాష్ట్రం రూపుదిద్దుకోబోతున్న ఈ మార్పును నెటిజన్లు హర్షంతో స్వాగతిస్తున్నారు. "విశాఖ ఏఐ క్యాపిటల్‌గా మారబోతోంది" అన్న కామెంట్లు విస్తృతంగా షేర్ అవుతున్నాయి.

# ప్రధాని శ్రీశైలం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



- 1800 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు
- హెలిపాడ్ నుంచి ఆలయం వరకు విస్తృత తనిఖీలు
- జోన్లుగా విభజించి పోలీసు బృందాలకు డ్యూటీలు కేటాయింపు
- ప్రతి వాహనంపై క్షుణ్ణమైన తనిఖీలు, కమాండ్ కంట్రోల్ మానిటరింగ్

మన గళం, అమరావతి : ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకోనున్న నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ ప్రకటించారు. మొత్తం 1800 మంది పోలీసు సిబ్బందిని మోహరించి కీలక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాని హెలిపాడ్‌కు చేరుకునే సమయం నుంచి దర్శనం ముగిసే వరకు ప్రతి మూలను జియోగ్రాఫికల్ మ్యాప్ ఆధారంగా గుర్తించి తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెలిపాడ్, ఆలయ పరిసరాలు, శివాజీ స్ఫూర్తి కేంద్రం, ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసి యాక్సెస్ కంట్రోల్ అమలు చేయాలని సూచించారు. రూట్‌మాప్‌పై క్షుణ్ణమైన పర్యవేక్షణ కోసం రూఫ్‌టాప్ టీమ్స్, క్యూ ఆర్టీ బృందాలు, ప్రత్యేక పహారా బృందాలను నియమించారు. ప్రతి పోలీసు సిబ్బందికి ప్రత్యేక డ్యూటీ పాసులు జారీ చేసి, ఐడీ కార్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. కీలక పాయింట్ల వద్ద కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం మానిటరింగ్ జరుగుతుందని ఎస్పీ సునీల్ తెలిపారు. శ్రీశైలానికి వచ్చే ప్రతి వాహనాన్ని 24 గంటల పాటు తనిఖీ చేస్తూ, ఎలాంటి అనుమానాస్పద కదలికను వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

## పవన్ హామీ నెరవేర్పు.. కాకినాడ
# సెజ్ రైతులకు భూముల పునరుద్ధరణ

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన మాటపై ప్రభుత్వ నిర్ణయం
- 2,180 ఎకరాల భూములు రైతుల పేరుకు మళ్లింపు
- రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, ఫీజులన్నీ మినహాయింపు
- సీఎం చంద్రబాబు ఆమోదంతో రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ



మన గళం, అమరావతి : కూటమి ప్రభుత్వం తన ఎన్నికల హామీలను అమలు చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో కాకినాడ సెజ్ బాధిత రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం 2,180 ఎకరాల భూములను రైతులకు తిరిగి అప్పగించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలోని 1,551 మంది రైతులకు పెద్ద ఎత్తున ఊరట కలిగింది. సెజ్ కోసం సేకరించిన భూములను మళ్లీ రైతుల వద్దకు చేరవేయాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుండగా, పిఠాపురం అభ్యర్థిగా ప్రచారం చేసిన పవన్ కల్యాణ్ ఆ సమస్యను ప్రజా వేదికలపై బలంగా వినిపించారు. రంగంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పట్టుదలతో సీఎం చంద్రబాబు దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి తక్షణ స్పందనతో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చర్యలు ప్రారంభించగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. రైతులు భూమిని తిరిగి పొందే ప్రక్రియలో ఎటువంటి ఆర్థిక భారమూ లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునేలా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములన్నీ రద్దు చేశారు. ఈ పరిణామంతో భూములు తిరిగి తమ హక్కులోకి వస్తున్నాయన్న సంతోషంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కుటుంబ అవసరాల కోసమైనా, భవిష్యత్ ప్రణాళికల కోసమైనా భూమిని వినియోగించుకోలేకపోయిన బాధ ఇప్పుడో పెద్ద ఉపశమనంగా మారిందన్న భావన వారిలో వ్యక్తమవుతోంది. పవన్ కల్యాణ్ ఈ నిర్ణయంపై స్పందిస్తూ, "ప్రజలకు ఇచ్చిన మాట పవిత్రం. రైతుల న్యాయమైన డిమాండ్‌ను అంగీకరించి చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబు, మంత్రివర్యులకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. ఈ హామీ అమలు జనసేన అభిమాన వర్గాల్లోనూ ఆనందాన్ని రేకెత్తించింది.

# ఉపరితల ఆవర్తన ప్రభావం



- నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- ఏలూరు సహా పలు జిల్లాల్లో వర్షాల సూచన
- పిడుగులు పడే అవకాశం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- చెట్లు, హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని హెచ్చరిక

మన గళం డెస్క్ : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తన పరిస్థితులు నమోదయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. దానికి తోడు దక్షిణ తమిళనాడు తీరం మీదుగా మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటంతో వర్షాలు మరింత తీవ్రంగా కురిసే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. మంగళవారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే అల్లూరి, కోనసీమ, తూర్పు, పడమర గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేశారు. పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు తదితర జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలు నివారించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చెట్లు, భారీ హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడకూడదని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, పశుపోషకులు వాతావరణ పరిస్థితులను గమనించి వ్యవసాయ చర్యలు చేపట్టాలని సూచించారు.

# తెనాలి చెంచుపేటలో దారుణ హత్య కలకలం

- నడిరోడ్డుపై మాస్క్ ధరించిన దుండగుడి దాడి - కత్తితో బుజ్జి అనే వ్యక్తిపై తీవ్రంగా దాడి - సంఘటనా స్థలంలోనే మృతిబీ పోలీసుల విచారణ ప్రారంభం




మన గళం, : గుంటూరు జిల్లా తెనాలి చెంచుపేటలో మంగళవారం ఉదయం ఘోర సంఘటన చోటుచేసుకుంది. అమర్తులూరు మండలం కోడితాడిపర్రుకు చెందిన బుజ్జి అనే వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, స్కూటీపై ముఖానికి మాస్క్ వేసుకున్న దుండగుడు వచ్చి అతనిపై కత్తితో దాడి చేశాడు. ఒక్కసారిగా జరిగిన ఈ దాడితో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించగా, వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరావడం లేదని, నిందితుడిని పట్టుకున్న తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. మాస్క్ ధరించి మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండగుడు ఎటువంటి ఆనవాళ్లు లేకుండా పారిపోవడంతో, పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ ముమ్మరం చేశారు. తెనాలి పట్టణంలో అప్రమత్తత పెంచి, ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఓ సాధారణ ఉదయం ఈ విధంగా హత్య జరిగి ఉద్రిక్తత నెలకొనడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, దుండగుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు నమ్మకం వ్యక్తం చేశారు.

# కాంట్రాక్టు సిబ్బంది విలీనంపై స్పష్ట నిర్ణయం కావాలి : షర్మిల

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ బహిరంగ మద్దతు ప్రకటించింది. ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని పేర్కొంటూ, ప్రభుత్వం చూపుతున్న మొండి ధోరణి వల్లే ఈ స్థితి ఏర్పడిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులను అణగదొక్కడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. ఇప్పటికే 58 సార్లు చర్చలు జరిగినా సమస్య పరిష్కారం చేపట్టకపోవడం బాధాకరమని షర్మిల మండిపడ్డారు. 63 వేల మంది ఉద్యోగులు ఆవేదనతో సమ్మెకు దిగాల్సి రావడం ప్రభుత్వ ఆరోపణలు కాదు, ప్రభుత్వ వైఫల్యమని ఆమె విమర్శించారు. ఉద్యోగుల జేఏసీ నేతలను వెంటనే చర్చలకు ఆహ్వానించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేకంగా 25 ఏళ్లుగా పనిచేస్తున్న 27 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలను పాత విధానంలోనే కొనసాగించి, 7500 మంది జూనియర్ లైన్‌మన్‌లకు పాత సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలని సూచించారు. ఉద్యోగుల కుటుంబాలకు అపరిమిత వైద్య సదుపాయం అందించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయకూడదని విజ్ఞప్తి చేశారు అదనంగా, పెండింగ్‌లో ఉన్న 4 డీఏ/డీఆర్‌లను వెంటనే విడుదల చేసి, విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని షర్మిల ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమం కొనసాగితే విద్యుత్ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, ఉద్యోగుల ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని ప్రకటించారు.

## డీజీపీని కలిసిన కర్నూలు జిల్లా ఎస్పీ



మనగళం, కర్నూలు క్రైం : అక్టోబర్ 16 తేదీన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూల్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల పై మంగళవారం రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా నగరంలోని బి.క్యాంప్ దగ్గర ఉన్న పోలీసు అతిథి గృహం చేరుకున్నారు. ఈ సందర్భంగా కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క ను అందచేశారు.

## ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

మనగళం, కర్నూలు సిటీ : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటనను ఐకమత్యంగా విజయవంతం చేద్దామని కేడీసీసీబీ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పిలుపునిచ్చారు. కర్నూలు పట్టణంలోని స్థానిక ఎన్వీఆర్ హెూటల్ లో కోడుమూరు నియోజకవర్గంలోని 4 మండలాల టీడీపీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇంచార్జిలు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులతో ప్రధాని పర్యటనపై సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, మీటింగ్ అబ్సర్వర్ కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కే. రామలింగా రెడ్డి, బీజేపీ నాయకులతో వారు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని భారీ బహిరంగ సభకు కూటమి శ్రేణులు, అభిమానులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. వెనుక బడిన మన కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి భారీగా తరలి రావాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, పెట్టు బడులు వస్తున్న క్రమంలో ప్రధాని చేతులమీదుగా వాటిని ప్రారంభించే లక్ష్యంతో ఇక్కడ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి జీఎస్టీ తగ్గింపు వల్ల రూ.2లక్షల కోట్లు ఆదాయం పడిపోయినా ప్రజా సంక్షేమం కోరి జీఎస్టీ తగ్గించారన్నారు. జీఎస్టీ తగ్గింపు విషయం ప్రజల్లోకి తీసుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకు లపై ఉందన్నారు. సభకు వచ్చే ప్రజలకు



ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత తొలిసారి ప్రధాని ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తునన్నట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్దేంచిన లక్ష్యానికి మించి జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు.

## కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16వ తేదీని కర్నూలు వస్తున్న నేపథ్యంలో హైకోర్టు... లేదా హైకోర్టు బెంచి ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్ యూ), జిల్లా అధ్యక్షులు సింగరాజు లక్ష్మణ్, న్యాయవాదులు జి సామ్సన్, సి ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూల్ సిటీ లోని కొత్త బస్టాండ్ దగ్గరలో ఉన్న కార్మిక కర్షక భవన్ మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంతో చారిత్రక చరిత్ర కలిగినటువంటి కర్నూలుకు హైకోర్టు కానీ హైకోర్టు బెంచ్ ను ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని అని అన్నారు. ఈ విషయంలో భారత ప్రధాని స్పష్టమైనటువంటి హామీ ఇవ్వాలని, హైకోర్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి హైకోర్టు విషయంలో ఒక స్పష్టమైన ఆదేశం ఇవ్వాలని, ఆ యొక్క ఆదేశాన్ని తక్షణము అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం హైకోర్టు అని ఐదేళ్ల కాలం కాలం గడిపిందని, ఎటువంటి హైకోర్టు పనులను అమలు జరపలేదని ఆరోపించారు. అదేవిధంగా కొత్తగా వచ్చినటువంటి కూటమి ప్రభుత్వం కూడా గత సంవత్సరం ఆరు నెలల నుండి బెంచ్ పై ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో పెట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి వస్తున్న సందర్భంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి తక్షణమే కర్నూల్ ప్రజల యొక్క ఆకాంక్ష మేరకు రాష్ట్ర హైకోర్టు, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి

- హంద్రీనీవా పరిధిలో 517 ట్యాంకులకు, 299 కృష్ణాజలాలతో నింపాం
- వైసీపీ ఐదేళ్లలో చేయలేనిది ఏడాదిలోనే చేసి చూపించాం
- సకాలంలో హంద్రీనీవా పనులు పూర్తి చేసిన అధికారులకు అభినందనలు
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



మనగళం, కర్నూలు సిటీ : హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని మొత్తం 517 చెరువులకు గాను 299 చెరువులని కృష్ణాజలాలతో నింపామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. హంద్రీ నీవా నీరుతో చెరువులు నింపే కార్యక్రమానికి సంబంధించి కర్నూలు ఇరిగేషన్ సీఈ కార్యాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు సకాలంలో పూర్తి చేసిన అధికారులను అందరినీ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. చివర ఉన్న కుప్పం వరకు కృష్ణాజలాలు తరలి వెళ్ళడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమకు గుండెకాయ అయిన హంద్రీనీవా ప్రాజెక్ట్ ని గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం ఆటకెక్కించిందన్నారు. ఆ ప్రభుత్వం ఐదేళ్లలో చేయనిది, కూటమి ప్రభుత్వం సంవత్సరంలో చేసి చూపించిందని రామానాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లన్ని 961 టిఎంసిల సామర్థ్యం ఉంటే 844 టీఎంసీలతో వాటిని నింపగలిగామన్నారు. అంటే 87.86% నీటిని నిల్వ చేయగలిగామని వివరించారు. అలాగే రాయలసీమలోని మొత్తం 38 నియోజకవర్గాల పరిధిలో హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలు విస్తరించి ఉన్నాయన్నారు. ఈ కాలువలకు అనుబంధంగా 517 చెరువులు ఉన్నాయని, వీటిలో 174 చెరువులు పూర్తిగా, 125 చెరువులు పాక్షికంగా అంటే మొత్తం 299 చెరువులు నింపగలిగామన్నారు. మిగిలినవి ప్రాధాన్య క్రమంలో ఫిబ్రవరి మాసానికల్లా నింపుతామన్నారు. ఈ కారణంగా ప్రస్తుతం రాయలసీమ చెరువుల్లో జలసిరి తాండవిస్తోందన్నారు. ఈ ఆనంద సమయంలో రాయలసీమ ప్రజలు గత ప్రభుత్వ పనితీరుకు, కూటమి ప్రభుత్వ పనితీరుకు మధ్య వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో సినిమా సెట్టింగులు, అద్దె ట్యాంకర్లు, అద్దె గేట్లు, బెంగళూరు నుంచి పూలు తెప్పించి నీటి వనరుల ప్రారంభోత్సవాలు నిర్వహించిన సంగతి, జగన్ హెలికాప్టర్ ఎక్కే సమయానికి ఆ నీరు ఆవిరి అయిపోయిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుందని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. రాయలసీమ ముద్దుబిడ్డనని చెప్పుకునే జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు తీరని ద్రోహం చేశాడని రామానాయుడు విమర్శించారు. హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశగా మడకశిర బ్రాంచ్ కాలువ పనులు అన్నీ పూర్తి చేసి హిందూపురం, మడకశిర, పెనుగొండ నియోజవర్గాలకు నీరుస్తామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి 400 కిలోమీటర్ల నుంచి 554 కిలోమీటర్ల వరకు అంటే అడివిపల్లి రిజర్వాయర్ నుంచి నీవా, అక్కడ నుంచి తిరుపతి కళ్యాణి డ్యామ్ వరకు అతి త్వరలో నీరు తీసుకెళ్లాలనేది సీఎం చంద్రబాబు ఆశయం అని రామానాయుడు స్పష్టం చేశారు. తద్వారా రాయలసీమను రతనాల సీమ చేయాలని కూటమిలోని తెలుగుదేశం, జనసేన, భాజపా పార్టీ లు కృత నిశ్చయంతో ఉన్నట్లు మంత్రి మరోసారి చెప్పారు. సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ప్రాజెక్టు సిఈలు కబీర్ భాషా నాగరాజు, ఎస్ఈలు, ఈఈలు, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీమ సమస్యలపై ప్రధానితో చర్చించండి

- శ్రీభాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి – గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలి
- విభజన చట్టం హామీలు నెరవేర్చేలా చూడాలి – టీడీపీ నేతలకు ఆర్వీపీఎస్ వినతి



మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16న కర్నూలు వస్తున్న నేపథ్యంలో సీమ సమస్యలపై చర్చించేలా మంత్రులు, టీడీపీ నేతలు చొరువ తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎంపీ బస్తిపాటి నాగరాజు కార్యాలయంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి, రాయలసీమ హక్కుల పోరాట సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చం నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజుకు ఆర్వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాదాసికురువ సుంకన్న, నాయకులు వినతి పత్రాలు అందజేశారు. సీమ సమస్యలపై ప్రధాని మోడీతో సీఎం చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్చించేలా ప్రజాప్రతినిధులు, నేతలు చొరువ తీసుకోవాలని ఈ సందర్భంగా వారు విన్నవించారు. శ్రీభాగ్ ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని, గుండ్రేవుల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిర్మాణం చేపట్టాలని, విభజన చట్టంలో కేంద్రం రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఓర్వకల్లు ప్రాంతంలో గ్రీన్ కో పరిశ్రమల హబ్ కొరకు మూడు టీఎంసీల రిజర్వాయర్ నిర్మాణం వెంటనే చేపట్టాలని, రాయలసీమ కరువు,వలసల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన మంత్రి అచ్చం నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్,ఎంపీ బస్తిపాటి నాగరాజు పులికనుమ ప్రాజెక్టును తామే చేపట్టామని గుర్తు చేశారు. ఓర్వకల్ వద్ద అనేక పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. రాయలసీమ అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంటుందని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి నాయకులు మదాసి కురువ భరత్ కుమార్,కె రాము,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్కేటింగ్ లో ప్రతిభను చాటిన మాంటే విద్యార్థులు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ జిల్లా రోలర్ స్కేటింగ్ సంగం ఆధ్వర్యంలో మోంటే పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో మాంటే స్కూల్ విద్యార్థులు సోమా జాశంకా ఆర్య, ఇషితా రింక్ , రోడ్ రసులలో చక్కటి ప్రతిభాను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోఆర్డినేటర్లు తబస్సు కలిసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కేటింగ్ ఒక చక్కని సాధన కలిగిన క్రీడని, విద్యార్థులు మంచి ఆరోగ్యంతో పాటు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించవచ్చు అని తెలిపారు. ఎంపికైనా క్రీడాకారులు నవంబర్ 1తేదీ నుండి కాకినాడ లో జరిగే రాష్ట్ర పోటీలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కేటింగ్ సంఘం సీఈఓ సునీల్ కుమార్, విద్యార్థులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పద్మావతి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ను మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. కళాశాల అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపాల్ ఎంపీ ని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే తన తెలుపాలని, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

## 15న పీఎం... గో బ్యాక్ నిరసన ర్యాలీ

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఉమ్మడి కర్నూలు జిల్లాకు అక్టోబర్ 16వ తేదీ ప్రధాని పర్యటన నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన సీఎం... గో బ్యాక్ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ న్యూ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, నరసింహులు, నగర ఉపాధ్యక్షులు టి రాముడు, కోశాధికారి సాయిబాబా తెలిపారు. ఈ మేరకు మంగళవారం కార్మిక అడ్డాలలో వారు నిరసన ర్యాలీపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 నుండి ఇప్పటి వరకు 55 లక్షల కోట్లు జీఎస్టీ వసూలు చేసి ఇప్పుడు సూపర్ జీఎస్టీ... తగ్గించామంటూ ప్రచారం చేసుకోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయలేదు, ప్రత్యేక హెూదా, ప్రత్యేక ప్యాకేజీ ఊసేలేదని... పీఎం ఏపీ రాష్ట్రానికి ఏమి చేశారని నిలదీశారు. కార్మికులు ఎప్పుడో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్నిహరించడం ఎంతవరకు న్యాయమన్నారు. గతంలో రాష్ట్రానికి మూడుసార్లు వచ్చిన నరేంద్ర మోడీ వలన రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం జరగలేదని, ఇప్పుడైనా కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, కర్నూల్ నుండి రాజధానికి ప్రతిరోజు రైళ్లు సౌకర్యాలు, 6 లైన్ల రోడ్డు మార్గాన్ని జిల్లా అభివృద్ధికి నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ సభను విజయవంతం చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16న కర్నూలులో నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్ సభను విజయవంతం చేయాలని కోడుమూరు నియోజవకర్గ బీజేపీ నాయకుడు వేల్పుల గోపాల్ పిలుపునిచ్చారు. ప్రధాని కర్నూలు పర్యటన నేపథ్యంలో మంగళవారం స్వాగతం... సుస్వాగతం ప్రాణం ఏర్పాట్లను రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, యువ మోర్చా అధ్యక్షులు సునిల్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో వేల్పుల గోపాల్ కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గ పరిధిలోని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్యనాయకుల సమావేశం పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని పిలపునిచ్చారు. కార్యక్రమంలో బెస్తఈరన్న, శ్రీనివాసులు, రాఘవేంద్ర, రజిత, విరమ్మ, అనంత్ తేజోరామ్, జగదీశ్, మధన్, మోహన్, వీరప్ప, రాజశేఖర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని సభ ప్రాంగణంలో రెండు తాత్కాలిక ఆసుపత్రులు

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు రాగమయూరి వద్ద ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభ ప్రాంగణం వద్ద రెండు తాత్కాలిక ఆసుపత్రులు ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి అడిషనల్ డీ ఎం ఈ అండ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రముఖులతో పాటు ప్రజలకు అత్యవసర సమయంలో ప్రాథమిక సేవలందించ నున్నట్లు తెలిపారు. ప్రముఖులకు పది పడకల ఆసుపత్రి, సామాన్య ప్రజలకుల 20 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా 15 పార్కింగ్ ప్రదేశాల్లో 104, 108 అంబులెన్స్ లు సిద్ధంగా ఉంచుతున్నట్లు తెలిపారు.

## ఒక్కరోజే రూ.3 వేలు పెరిగిన బంగారం ధర

మనగళం, సామాన్యులను ఊరిస్తున్న బంగారం .. సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం.

# గోరంట్ల గ్రామంలో 4 వ అంగన్వాడీ కేంద్రం నందు సూపర్వైజర్ కే మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో 8 వ రాష్ట్ర పోషణ మాత్సవాలు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రమైన గోరంట్ల గ్రామంలో 4 వ అంగన్వాడీ కేంద్రం నందు సూపర్వైజర్ కే మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో 8 వ రాష్ట్ర పోషణ మాత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మల్లేశ్వరి మాట్లాడుతూ మాసోత్సవాల వల్ల తల్లులు తమ ఆహార అలవాట్లను మార్చుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తున్నారని తెలిపారు గర్భవతులు సమతుల్య ఆహారం తీసుకోవాలని ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డలు పౌష్టికంగా పెరుగుతారని వివరించారు. గర్భవతులు, బాలింతలు చిరుధాన్యాలతో పోషణ విలువలు పెంచుకోవాలన్నారు. గ్రామంలో చౌకగా దొరికే ఆకుకూరలు ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. అంగన్వాడికి కేంద్రంలో ఇచ్చే కిట్లు, గుడ్లు గర్భవతులు, బాలింతలు మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్వాడీ పోషక ఆహారాలు సమృద్ధిగా దొరుకుతాయని వివరించారు బాలికలు, పిల్లలకు ఆటపాటలతో విద్యనందిస్తూ కిషోర్ బాలికల సంరక్షణ పట్ల తల్లులు ప్రత్యేక జాగ్రత్త పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి అంగన్వాడీ టీచర్లు ఫాతిమా, లక్ష్మీదేవి, రాధా, ప్రమీల, కేంద్రంలోని పిల్లలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా తదితరులు పాల్గొన్నారు





# ప్రధాని మోడీ పర్యటన విజయవంతం చేద్దాం

మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో మంగళవారం టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అధ్యక్షతన స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ లో కర్నూలు, నంద్యాల జిల్లాల కూటమి పార్టీల నాయకుల సమన్వయ కమిటీ సమా వేశం జరిగింది. ప్రధానంగా జీఎస్టీ మహాసభను విజయవంతం చేసేందుకు జనసకీరణ, రవాణ వ్యవస్థ తదితర అంశాలపై చర్చించారు. ప్రధాని మోడీ పర్యటనను ఐకమత్యంగా విజయవంతం చేద్దామని నేతలు పిలుపునిచ్చారు. సమావేశానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస రావు, మంత్రి నిమ్మల రామానాయుడు, పి.నారాయణ, బీ.సి. జనార్ధన్ రెడ్డి, కె. అచ్చెన్నాయుడు, సత్యకుమార్, రాం ప్రసాదొడ్డి, గొట్టిపాటి రవికుమార్, వంగాలపూడి అనిత, కరూలు పార్లమెంట్ సభ్యులు బి. నాగరాజు, యం.యల్.సి, జోన్ 5 ఇన్చార్జ్ బీద రవిచంద్ర, జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు పి.వి.ఎన్.మాధవ్, ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు చింతా సురేశ్, కర్నూలు జిల్లా బీజేపి అధ్యక్షులు రామక్రిష్ణ పరమహంస, నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభి రుచి మధు, ఏ.పీ.ఎస్.ఆర్.టీ.పీ చైర్మన్ పూల నాగరాజు, డి.సి.ఎం.ఎస్ చైర్మన్ వై.నాగేశ్వర రావు యాదవ్, ఆదోని నియోజకవర్గం ముఖ్య నాయకులు కె.ఉమాపతి నాయుడు, అహుడా చైర్మన్ టి.సి.వరుణ్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు జె.రేఖా గౌడ్, బీ.జే.వై.ఎం రాష్ట్ర అధ్య క్షులు ఎస్.సునీల్ రెడ్డి తదితర టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్యనాయకులు హాజరయ్యారు.



# ఇంజనీర్ సుబ్బరాయుడికి ఘన నివాళి

మనగళం, కర్నూలు సిటీ : రాయలసీమ నీటి వనరుల అభివృద్ధికై నికరంగా కృషి చేసిన యోధుడు ఇంజనీర్ సుబ్బరాయుడు అని సీపీఎం నాయకులు కొనియాడారు. కర్నూల్ నగరంలోని దేవ నగర్ వద్ద ఉన్న సూర్య అపార్ట్మెంట్స్ లోని ఇంజనీర్ సుబ్బరాయుడు నివాసం వద్ద మంగళవారం ఆయన భౌతికకాయానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఉద్యోగం వ్యక్తిగత జీవితమే కాదు, సమాజ అవసరమని భావించి ప్రజలు పడే కష్టాలకు పరిష్కారం చూపించడమే అసలైన జీవితం అంటూ.. జీవిత చివర అంకం వరకు రాయలసీమ కన్నీటి కష్టాల కోసం పరితపించి పనిచేసిన శక్తి సుబ్బరాయుడు అని నాయకులు గుర్తు చేశారు. వేదవతి గుండ్రేవుల ఆర్డీఎస్ కుడి కెనాల్ నీటి ప్రాజెక్టులు నిర్మించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సుబ్బరాయుడు చూపిన మార్గంలో నీటి వనరుల సాధనకై సీపీఎం గా ఉద్యమిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివిస్ రాధాకృష్ణ, జి రామకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, టి రాముడు, ఎండి అంజిబాబు, ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు నగేష్, గురు శేఖర్, రాఘవేంద్ర, నగర నాయకులు హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



# బుడగ జంగం రిజర్వేషన్ సమస్యను పీఎం దృష్టికి తీసుకెళ్తా



– నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

మనగళం, కర్నూలు సిటీ : బేడ బుడగ జంగం కమ్యూనిటీకి మళ్లీ ఎస్సీ జాబితాలో చేర్చేందుకు ఇప్పటికే సీఎం నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గుర్తు చేశారు. తాను కూడా పార్లమెంట్ లోరెండు సార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళానని చెప్పారు. నంద్యాల జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ దృష్టికి బేడ బుడగ జంగం ఎస్సీ రిజర్వేషన్ సమస్య తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం శ్రీనివాసనగర్ లోని బుడగ జంగం కాలనీలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పర్యటించి ప్రధాన మంత్రి సభకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుడగజంగాల సంచార జాతిగా, బిక్షాటనచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, రిజర్వేషన్ లేకపోవడంతో చాలా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బుడగజంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్ సి రిజర్వేషన్ కల్పించి న్యాయం చేస్తుందన్న నమ్మకం నాకు ఉందన్నారు. ప్రధాని బహిరంగ సభకు ప్రతిఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎంపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ సభాస్థలిని పరిశీలించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్రమోడీ కర్నూలు పర్యటనలో భాగంగా ఈ నెల 16న నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోనీ రాగమయూరి వెంచర్ లో నిర్వహించనున్న బహిరంగ సభా స్థలం, వేదికను నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనం అనంతరం నన్నూరు వద్ద జరిగే భారీ బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రసంగిస్తారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. సభా వేదిక, బయట వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లపై అధికారులను ఎంపీ అడిగి తెలుసుకున్నారు.

# గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి



మనగళం, నంద్యాల టౌన్ : గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందనుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం నేడు సిటీ ఆఫ్ డెస్టినీ వైపే చూస్తుందని, గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధిలతో మన ప్రభుత్వం ఒప్పందం శుభపరిణామం అన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారన్నారు. ఏడాదిపాటు శ్రమించి నేషనల్ పాలసీల్లోనూ మార్పులు చేయించి రెండు లక్షల మందికి ఉపాధి కల్పించే రూ.1.33 పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయం అన్నారు. అమెరికా తర్వాత అతిపెద్ద ఏఐ హబ్ గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయబోతుందన్నారు. ఈ డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సైతం బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, వైద్యం, విద్య రంగాలు మెరుగుపడతాయని సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ ఆధారిత వ్యవస్థలకు గూగుల్ అనుసంధానం చేయనుందని, దీంతో అంతర్జాతీయ స్థాయిలో విశాఖపట్నం కనెక్టివిటీ కేంద్రంగా మారనుందన్నారు. ఈ హబ్ లోని ఏఐ టెక్నాలజీ ద్వారా గూగుల్ సెర్చ్, యూట్యూబ్, జీ మెయిల్, యాడ్స్, క్లౌడ్ వంటి ఇతర గూగుల్ సేవలు విశాఖ నుంచే ప్రపంచానికి అందించబడనున్నాయని వివరించారు. దేశం మొత్తం గర్వించే సంస్థ రాష్ట్రానికి వస్తే అందరూ ప్రశంసిస్తుంటే.... వైసీపీ నేతలు మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ఆకాశ మార్గంలో పెరుగుతున్న ప్రమాదాలు

– ప్రయాణ భద్రతపై పెరుగుతున్న అనుమానాలు

ఆకాశయానాన్ని మనుషులే అత్యంత సురక్షిత ప్రయాణ మార్గంగా భావిస్తారు. కాలాన్ని జయిస్తూ, సముద్రాలు, అరణ్యాలు దాటి వేగంగా చేరుకునే మార్గంగా విమానాలు ప్రపంచాన్ని దగ్గర చేశాయి. అయితే ఇటీవలి సంవత్సరాల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు ఈ నమ్మకాన్ని కదిలిస్తున్నాయి. ప్రయాణ సౌలభ్యం పెరిగినా, భద్రత విషయంలో ప్రశ్నార్థకం ఎత్తి చూపే ఘటనలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. చిన్న ప్రాంతాల నుంచే విమాన సౌకర్యం అందుబాటులోకి రావడంతో, ఎయిర్ ట్రాఫిక్ అమితంగా పెరిగింది. కానీ ట్రాఫిక్ పర్యవేక్షణకు కావలసిన సిబ్బంది, ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం అంత వేగంగా అభివృద్ధి చెందలేదు. ఒక్క పొరపాటు సంకేతం లేదా సమన్వయం లోపం కూడా ప్రమాదానికి దారి తీస్తోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో లేదా వర్షపు మబ్బులతో కూడిన పరిస్థితుల్లో నియంత్రణ కేంద్రాలపై ఒత్తిడి మరింత పెరుగుతోంది.

ప్రమాదాలపై అధ్యయనాలు చెబుతున్నాయి : మెంటినెన్స్ లోపాలు ముఖ్య కారణంగా మారుతున్నాయని. ప్రైవేట్ సంస్థలు లాభ నష్టాల లెక్కలతో మెంటినెన్స్ ప్రక్రియలను వేగంగా ముగించాలని చూస్తున్నాయి. ఇంజనీర్లకు తగిన సమయం ఇవ్వకపోవడం, విడిభాగాల మార్పులు పూర్తి తనిఖీ చేయకుండా జరగడం వంటి అంశాలు ప్రాణ నష్టానికి కారణమవుతున్నాయి. ఒక చిన్న సాంకేతిక లోపాన్ని నిర్లక్ష్యం చేస్తే అది ప్రయాణికుల జీవితాల్ని బలి తీసుకుంటుంది. మరో ముఖ్య కారణం మానవ తప్పిదాలు. విమానం నడిపే పైలట్లపై పని ఒత్తిడి తీవ్రమవుతోంది. వరుస ప్రయాణాలు, విశ్రాంతి లేకపోవడం, మానసిక అలసట నిర్ణయ సామర్థ్యాన్ని తగ్గిస్తోంది. విమానం గాల్లో ఉన్నప్పుడే అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాల్సిన సమయంలో, అలసటతో కూడిన స్పందన ప్రమాదాన్ని మరింత తీవ్రమజేస్తుంది. పైలట్లకు కేవలం శిక్షణ కాకుండా మానసిక సమతుల్యత కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించే విధానం ఉండాలి. పలు దేశాల్లో పాతబడిన విమానాలు ఇంకా సేవల్లో ఉన్నాయి. యంత్రాల ప్రాణకాలం పూర్తయినా, కొత్త విమానాలు కొనుగోలు చేయడం ఖర్చుతో కూడుకున్న పని కావడంతో సంస్థలు వాటిని మరమ్మతుల పేరుతో కొనసాగిస్తున్నాయి. కానీ వయసు పైబడిన యంత్రాంగంలో లోపాలు కనిపించకుండా ఉండటం కష్టం. ప్రయాణికుల ప్రాణాలకు సంబంధించి ఇలాంటి ప్రమాదకర ధోరణిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అంతర్జాతీయ విమాన నియంత్రణ సంస్థలు మార్గదర్శకాలు రూపొందించినా, వాటి అమలులో దేశాల మధ్య స్పష్టమైన అంతరం కనిపిస్తోంది. కొన్ని దేశాలు కఠిన తనిఖీలు చేపట్టగా, మరికొన్ని ప్రాంతాల్లో పత్రాల పరిశీలనతోనే అనుమతులు ఇస్తున్నారు. విమాన భద్రత కోసం నియమాలు ఒక్కటిగా ఉన్నా, వాటి అమలు మాత్రం అసమానంగా ఉండటం ప్రధాన సమస్యగా మారింది.

ప్రమాదాల నేపథ్యంలో విమానయాన భద్రతపై పలు నిపుణులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విమాన సాంకేతిక నిపుణుడు రమణారెడ్డి అభిప్రాయం ప్రకారం, మెంటినెన్స్ వివరాలు ప్రజలకు అందుబాటు లో పెట్టే పారదర్శక వ్యవస్థ అవసరమన్నారు. విమాన నియంత్రణ సేవల్లో పనిచేసిన మాజీ పైలట్ అజయ్‌కుమార్ అభిప్రాయమేమంటే, పైలట్లకు ప్రతి ప్రయాణానికి మధ్య తప్పనిసరిగా విశ్రాంతి సమయం ఇవ్వాలని అన్నారు. అంతర్జాతీయ భద్రతా విశ్లేషకుడు సునీల్‌వర్మ చెప్పిందేమిటంటే, పాత విమానాలకు అనుమతులు ఇవ్వడానికి ముందు మూడు స్థాయిల సాంకేతిక తనిఖీలు తప్పనిసరి చేయాలని సూచించారు.

విమాన ప్రయాణం ఇప్పటికీ వేగవంతమైన మార్గం. కానీ వేగంతో పాటు జాగ్రత్త కూడా సమాన నిష్పత్తిలో ఉండాలి. భద్రతా నియంత్రణ కేవలం పత్రాల పరిమితిలో కాకుండా, యంత్రాల హృదయ స్పందనను పరీక్షించే స్థాయిలో ఉండాలి. విమాన ప్రయాణం ఒక ఆభరణంలాంటిది ఎంత మెరుస్తున్నా, లోపలి బలం లేకపోతే అది ఏ క్షణమైనా విరిగిపోవచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు, సంస్థలు, సాంకేతిక నిపుణులు కలిసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడే దిశగా మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.

– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు, (డిజైనర్ టెక్ గురు) 8897975262

# జీవరాశి హితాన్ని కోరేది హిందుత్వం



మనగళం, ఓర్వకల్లు : సృష్టిలోని సమస్తమైన జీవరాశి హితాన్ని కోరేది హిందుత్వం మాత్రమేనని, హిందుత్వమంటే మహోన్నతమైన జీవన విధానమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండలం, ఉప్పలపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానం నందు ఐదు రోజుల ధార్మిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, తెలుగు పండితులు గరుడాద్రి వనజ కుమారి శ్రీమద్రామాయణంపై చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు ఎ. నాగన్న, అధ్యక్షులు అయ్యస్వామి, అయ్యన్న, లలితమ్మ, భజనమండలి అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హిందువుల మనోభావాలు దెబ్బతీయకండి

– దేవాలయాల జోలికి వెళ్లకండి

– ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి జోక్యంతో రైల్వే సద్ధుమణిగిన సమస్య



మనగళం, నంద్యాల టౌన్ : హిందువుల మనోభావాలు దెబ్బతీయకండి... ఆలయాల జోలికి వెళ్లకండి... ఎవరూ ఫిర్యాదు చేయకున్నా ఆలయాల పైకప్పు ఎలా తొలగిస్తారు... బాటసారులకు ఇబ్బంది లేకుండా ఉన్న సమూహ ఆలయాలు తొలగించాలనే ఆలోచన మీకు ఎందుకు వచ్చింది...అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అసహనం వ్యక్తం చేశారు. దేవుళ్లకు నిత్యం సేవచేసే ప్రభుత్వ ఉద్యోగి టీచర్ నారాయణను రైల్వే స్టేషన్ లో ఒక రోజంతా ఎలా నిర్బంధిస్తారంటూ రైల్వే అధికారులను ప్రశ్నించారు. మంగళవారం నంద్యాల రైల్వే స్టేషన్ కు నూనెపల్లి నుంచి వచ్చే రహదారి పక్కన ఉన్న వినాయక గుడి, నాగుల కట్ట శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్యం స్వామి, పరమేశ్వరుడు, శ్రీ వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామి, నవగ్రహ చిన్న మండపాలు పూర్వం నుంచి ఉన్నాయి. మూలసాగరం, నూనెపల్లి, సాయిబాబా నగర్, ఎం ఎస్ నగర్ తదితర కాలనీల భక్తులు పూజలు చేసూకుంటూ తమ మొక్కుబడులు తీర్చుకుంటుంటారు. ఉపాధ్యాయుడు నారాయణ, మిత్ర బృందం ఈ సామూహిక చిరు ఆలయాల్లో ప్రతి పండుగ ఘనంగా నిర్వహిస్తారు. అటుగా వెళ్లే బాటసారులకు అన్న ప్రసాద వితరణ చేస్తుంటారు. అయితే ఉన్నట్టుండి నంద్యాల రైల్వే డివిజనల్ ఓ అధికారి ఇక్కడ ఈ ఆలయాల గోల ఎలా, వెంటనే వాటిని తీసివేయండి అంటూ నంద్యాల రైల్వే పోలీసులకు ఆదేశాలు ఇవ్వడం, సోమవారం రాత్రి ఆలయాల పర్యవేక్షకుడు నారాయణను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని ఆలయాలపై ఉన్న రేకులు ఉటాహుటిన తొలగించారు. దీంతో నూనెపల్లి, మూలసాగరం, రైల్వే స్టేషన్ ప్రాంతం లోని కాలనీల ప్రజలు, హిందూసంఘాల ప్రతినిధులు సుమారు మూడు వందల మంది ఆలయాల వద్దకు చేరుకొని ఎవరికీ ఇబ్బంది లేని మా ఆలయాలు ఎందుకు తొలగిస్తున్నారని రైల్వే పోలీసులు, అధికారులతో వాదనకు దిగారు. రాష్ట్రీయ ధర్మ రక్షా దళ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎన్. పి.నవీన్ గౌడ్, చింతలపల్లి వాసు తదితరులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రైల్వే అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రధాని మోడీ నంద్యాల జిల్లాకు వస్తున్న సమయంలో ఏంటీ చర్యలు అని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలు కాపాడాలని, తొలగించిన రేకుల షెడ్ వెంటనే వేయాలని సూచించారు. పూర్వం నుంచి ఉన్న ఆలయాలు అలాగే యథావిధిగా ఉండేలా చూడాలని కోరడంతో రైల్వే అధికారులు వెనక్కు తగ్గారు. దీంతో సమస్య సద్ధుమణిగింది. హిందూ సంఘాల ప్రతినిధులు కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్, చింతలపల్లి వాసు, శేష సాయి, రంగస్థల కళాకారుడు శివరామిరెడ్డి, కన్నయ్య, బసవరాజు, రాం ప్రసాద్, నాగదీప్, నాగభూషణం, చందు తదితరులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ధన్యవాదాలు తెలిపారు.



# మల్లన్న భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

– ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు



మనగళం, నంద్యాల: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించనున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ట్రాఫిక్ నిబంధనలు విధించామని, మల్లన్న భక్తులు సహకరించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీశైలం వైపు వెళ్లే రహదారులపై తాత్కాలిక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా అక్టోబర్ 16న ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు శ్రీశైలం వైపు వాహన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో హైదరాబాద్ నుండి శ్రీశైలం వైపు ప్రయాణించే భక్తులు, అలాగే దోర్నాల మార్గం ద్వారా శ్రీశైలం చేరుకునే యాత్రికులు తమ పర్యటన ప్రణాళికలను తగిన విధంగా సవరించుకోవాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇచ్చే సూచనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి పర్యటన అనంతరం సాధారణ వాహన రాకపోకలు పునరుద్ధరించబడతాయని తెలిపారు.

# టోకు ద్రవ్యోల్బణం స్వల్ప తగ్గుదల



మన గళం, సెప్టెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గింది. టోకు ధరల సూచిక 0.13 శాతానికి తగ్గిందని మంగళవారం కేంద్రం విడుదల చేసిన డేటా పేర్కొంది. ఆగస్టులో టోకు ధరల సూచి ద్రవ్యోల్బణం 0.52 శాతంగా ఉండగా.. గత ఏడాది ఇదే సమయంలో 1.91 శాతంగా ఉందని నివేదిక చెప్పింది. టోకు ద్రవ్యోల్బణంలో సానుకూల ధోరణికి ఆహార ఉత్పత్తులు, ఆహారేతర వస్తువులు, రవాణా, దుస్తుల తయారీ ధరలు పెరగడమే కారణమని పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. టోకు ధరల సూచిక డేటా ప్రకారం.. ఆగస్టులో ఆహార ధరలు 3.06 శాతంతో పోలిస్తే సెప్టెంబర్‌లో 5.22 శాతం తగ్గాయి. అదే కాలంలో కూరగాయల ధరలు కూడా తగ్గాయి. ఆగస్టులో 14.18 శాతంతో పోలిస్తే.. సెప్టెంబర్‌లో కూరగాయల ధరలు 24.41 శాతం చేరాయి. ఆగస్టులో 2.55 శాతంతో పోలిస్తే తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 2.33 శాతానికి తగ్గింది.

రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ట్రాక్ చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల ప్రారంభంలో తన బెంచ్‌మార్క్ పాలసీ రేట్లను 5.5 శాతం వద్ద మార్చలేదు. సోమవారం విడుదల చేసిన అధికారిక డేటా ప్రకారం, సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి 1.5 శాతానికి పడిపోయింది. ఆహార ఉత్పత్తులు, ఆహారేతర వస్తువులు, రవాణా పరికరాలు, దుస్తుల తయారీ ధరల పెరుగుదల కారణంగా సెప్టెంబర్ 2025 లో టోకు ద్రవ్యోల్బణంలో సానుకూల ధోరణి ఉందని పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. హెూల్ సేల్ ప్రైస్ ఇండెక్స్ డేటా ప్రకారం.. ఆగస్టులో 3.06 శాతంతో పోలిస్తే.. సెప్టెంబర్‌లో ఆహార ధరలు 5.22 శాతం తగ్గాయి. కూరగాయల ధరలు కూడా ఇదే కాలంలో తగ్గాయి. కూరగాయల ధరలు ఆగస్టులో 14.18 శాతంతో పోలిస్తే.. సెప్టెంబర్ లో 24.41 శాతం తగ్గాయి. తయారైన ఉత్పత్తుల ద్రవ్యోల్బణం ఆగస్టులో 2.55 శాతంతో పోలిస్తే.. 2.33 శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ రంగాల్లో ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 2.58 శాతంగా నమోదైంది. ఇది అంతకుముందు నెలలో ఇది 3.17 శాతంగా ఉన్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన బెంచ్‌మార్క్ పాలసీ రేట్లను ఈ నెల ప్రారంభంలో 5.5 శాతం వద్దే యథావిధిగా కొనసాగించింది. రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి 1.5 శాతానికి పడిపోయిందని సోమవారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో గణనీయంగా తగ్గి 1.54 శాతానికి చేరుకుంది. గడిచిన ఎనిమిదేళ్లలో ఇదే కనిష్టం. అంతకుముందు నెలలో ఇది 2.07 శాతంగా నమోదైంది. కూరగాయలు, పప్పులతో పాటు ఇతర ఆహార పదార్థాల ధరలు అదుపులో ఉండడం ద్రవ్యోల్బణం తగ్గడానికి ప్రధాన కారణమని ఎన్ఎస్ఓ పేర్కొంది. 2024 సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 5.49 శాతంగా ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో %-%2.28 శాతంగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం మరుసటి ఆరు నెలల ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బీఐ తగ్గించిన విషయం తెలిసిందే. నైరుతి రుతుపవనాలు, ఖరీఫ్‌లో అధిక సాగు, రిజర్వాయర్లలో భారీగా నీరు ఉండడం, ధాన్యాల బఫర్ స్టాక్ కారణంగా ఆహార ఉత్పత్తులు అదుపులోనే ఉంటాయని అంచనా వేసింది.

# శ్రీశైలం దేవస్థానం మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పై ఉప ముఖ్యమంత్రి తో సమీక్షా సమావేశం




మనగళం శ్రీశైలం : శ్రీశైలం దేవస్థానం మాస్టర్ ప్లాన్ పై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన సమీక్షా సమావేశం. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం లో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శ్రీశైలం దేవస్థానం అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలు, దశల వారీగా అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర సమీక్ష శ్రీశైలం ఆలయం పరిసర ప్రాంతాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు, క్షేత్ర అభివృద్ధి కొరకు అటవీ శాఖ అభ్యంతరాలు తదితర అంశాలు, విస్తరణపై చర్చ సమీక్షా సమావేశంలో పాల్గొన్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, అటవీ శాఖ ఉన్నతాధికారులు. శ్రీశైలం అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌లో రహదారులు, వసతి గృహాలు, పార్కింగ్, భక్తుల సౌకర్యాలు, పర్యాటక మౌలిక సదుపాయాలపై దృష్టి ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ, అటవీ శాఖ అనుమతులపై సమగ్ర సమీక్ష .ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో భవిష్యత్తు లో శ్రీశైల క్షేత్ర మాస్టర్ ప్లాన్ పై ఫోకస్... మాస్టర్ ప్లాన్ కు సంబందించిన సమగ్ర సమాచార నివేదిక ను రేపు శ్రీశైలం రానున్న ప్రధాని మోడీ కి సమర్పించే ఆలోచన లో అధికారులు.

# ప్రధాని పర్యటనకు సుమారు 1800 మందితో ప్రతిష్ట బందోబస్తు ఏర్పాట్లు....

- శ్రీశైల క్షేత్రం చుట్టూ పోలీసుల డేగ కన్నుతో నిఘా...
- ప్రధాని పర్యటించే ప్రాంతాలలో భద్రత మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశాలు జారీ....
- అడిషనల్ ఎస్పీ స్థాయి నుండి ఎస్సై స్థాయి వరకు బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీస్ అధికారులు, లైజనింగ్ ఆఫీసర్స్ తో సమీక్ష సమావేశం నిర్వహణ....
- నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ గారు....






మనగళం శ్రీశైలం : ఈనెల 16వ తేదీన భారతదేశ ప్రధాని శ్రీ నరేంద్రమోదీ గారు నంద్యాల జిల్లా శ్రీశైలం నందు పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ %ఖూా% గారు సుమారు 1800 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి హెలిపాడ్ కు చేరుకున్నప్పటి నుండి దర్శనం అనంతరం తిరిగి వెళ్లే వరకు ఆయన పర్యటించు ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించి ముఖ్యమైన ప్రాంతాలలో మరియు కూడళ్లలో సాయిధ బలగాలతో పికెట్లను ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేయడం జరిగింది. బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని 10 సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టార్కు ఒక ఉన్నతాధికారిని ఇన్చార్జిగా నియమించడం జరిగింది. జియో గ్రాఫికల్ మ్యాప్ ద్వారా ప్రధాని పర్యటించే ప్రాంతాలలో తీసుకోవలసిన భద్రత చర్యలను క్షుణ్ణంగా సిబ్బందికి జిల్లా ఎస్పీ గారు వివరించారు. ప్రధాని మంత్రి గారికి భద్రతాపరంగా అత్యంత భద్రత ఉంటుందన్నారు. రోడ్డు మార్గాలలో, ముఖ్యమైన కూడళ్లలో ,గుడి పరిసర ప్రాంతాలలో రూఫ్ టాప్ సిబ్బందిని నియమించి వారికి బైనాక్యులర్ తో నిరంతరం పరిశీలించాలని ఆదేశించడం జరిగింది. శ్రీశైలానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేయాలని ఇది 24/7 కొనసాగించాలన్నారు. కమాండ్ కంట్రోల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కెమెరాలను పరిశీలించాలని ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. హెలిపాడ్, గుడి, శివాజీ స్ఫూర్తి కేంద్రం ప్రాంతాలలో ప్రవేశ నిష్క్రమణ మార్గాలలో యాక్సెస్ కంట్రోల్ ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు



నిర్వహించాలన్నారు. శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రౌడ్ కంట్రోల్ కొరకు రూఫ్ టాప్, క్యూఆర్టి, స్పెషల్ పార్టీలను నియమించుకోవాలని ఆదేశించారు. ప్రధాని పర్యటనకు వచ్చిన సుమారు 1800 మంది పోలీస్ అధికారులు సిబ్బందికి ప్రత్యేకమైన డ్యూటీ పాసులను ఆత్రేయ డిజిటల్స్ వారి సహకారంతో ఏర్పాట్లు చేయడం జరిగింది. డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ ఐడి కార్డులు ధరించాలన్నారు. రెవిన్యూ అధికారులు ఇచ్చిన ఆసులను క్షుణ్ణంగా తప్పనిసరిగా పరిశీలించాలన్నారు.

# దోర్నాల మండల అధ్యక్షుడు కె.వి. నాయుడు పండు, యామ దాసయ్య, రామిశెట్టి కృష్ణ శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిచ్చయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన వేళ

మనగళం : ప్రకాశం జిల్లా దోర్నాల మండల అధ్యక్షుడు కె.వి. నాయుడు పండు, నాయకులు యామ దాసయ్య, రామిశెట్టి కృష్ణ శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిచ్చయ్యను శ్రీశైలంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంత అభివృద్ధి, భక్తుల సౌకర్యాల విస్తరణ, ఆలయ పరిసరాల్లో సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. స్థానిక ప్రజల అభ్యున్నతి కోసం ట్రస్ట్ బోర్డు సహకారం కోరారు. పిచ్చయ్య ఈ సందర్భంగా వీరికి హృదయపూర్వక స్వాగతం పలికి, అభివృద్ధి కార్యక్రమాల్లో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు పిచ్చయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



# పవర్ పెట్రోల్ కొట్టించడం వల్ల నిజంగా తేడా వస్తుందా?




మనగళం: ప్రమాణాలు అమలు చేయబడినప్పటి నుంచి పెట్రోల్ నాణ్యత కాస్త మెరుగుపడింది. అయితే పెట్రోల్ బంకుల్లో కనిపించే పవర్ పెట్రోల్ అంతకంటే నాణ్యమైనది గా చెప్పుకోవచ్చు. ఇందులో ఇథనాలు తక్కువగా ఉండి ఆక్టేన్ లెవల్స్ ఎక్కువగా ఉంటాయి. అంటే ఇది మరింత బెటర్ గా ఇంజిన్ లో బర్న్ అవుతుంది. వీటిని లగ్జరీ కార్లు, హై ఎండ్ బైక్స్ కోసం రూపొందిస్తారు. అందుకే దీని ధర కాస్త ఎక్కువ ఉంటుంది. అయితే ఇది నిజంగా బండి పెర్ఫామెన్స్ ను ఇంప్రూవ్ చేస్తుందా? పవర్ పెట్రోల్ వల్ల ఇంజిన్ మరింత క్లీన్ గా ఉంటుందన్న మాట వాస్తవమే. అయితే సాధారణ బైకులు, కార్లకు దీని వల్ల పెద్ద ప్రయోజనం లేదనే చెప్పాలి. ఎందుకంటే.. ప్రీమియం పెట్రోల్ వల్ల ఇంజిన్ కొద్దిగా సున్నితంగా నడుస్తుంది. కొన్ని ఎక్స్ ట్రా క్లీనింగ్ ఏజెంట్లను కలిగి ఉంటుంది. మీరు ప్రతిసారీ ప్రీమియం పెట్రోల్ కొట్టిస్తుంటే ఓకే. కానీ, ఒకసారి మామూలు పెట్రోల్ మరోసారి పవర్ పెట్రోల్ కొట్టించడం వల్ల పెద్దగా లాభం ఉండదు. అయితే ఎక్కువ సీసీ ఇంజిన్లు, ప్రీమియం కార్లుకి ఇది కొంత మేలు చేసేఅవకాశం ఉంది.

మీ బండికి ఏ పెట్రోల్ మంచిది?

మీ దగ్గర 2020 తర్వాత తయారు చేయబడిన బండి ఉంటే మీరు సాధారణ పెట్రోల్ ను వాడినా నష్టం ఏమీ ఉండదు. ఒకవేళ మీ దగ్గర స్పోర్ట్స్ కారు లేదా వింటేజ్ మోడల్ కారు లేదా బైక్ వంటివి ఉన్నట్టయితే వాటిని మరింత ఎక్కువ కాలం వచ్చేలా పవర్ పెట్రోల్ వాడొచ్చు. పవర్ పెట్రోల్ ఇంజిన్ తుప్పు పట్టకుండా కాపాడుతుంది. పెర్ఫామెన్స్ ను కూడా పెంచుతుంది. కాబట్టి ప్రీమియం వెహికల్స్ ను అది సరిపోతుంది.

# శ్రీశైలంలో అతిథి గృహాన్ని పరిశీలించిన మంత్రులు



మనగళం శ్రీశైలం : ప్రధాని శ్రీశైలం పర్యటన సందర్భంగా భ్రమరాంబ అతిథి గృహాన్ని మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ పరిశీలించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, కలెక్టర్ రాజకుమారితో కలిసి అతిథి గృహంలోని సదుపాయాలపై వారు ఆరా తీశారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. వారి వెంట ఈవో శ్రీనివాసరావు ఉన్నారు.

# శ్రీ శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శించుకున్న ఏపీ మంత్రులు



మనగళం శ్రీశైలం : శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్య ప్రసాద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారితోపాటు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితరులు ఉన్నారు. ఆలయ రాజగోపురం వద్ద ఈవో శ్రీనివాసరావు, అధికారులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. పూజల అనంతరం లడ్డూ ప్రసాదాలు అందజేశారు.


# శ్రీశైలంలో ప్రధాని పర్యటన సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోనికి ప్రవేశించు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు....

- నల్లమల్ల అడవులలో తనిఖీలు ముమ్మరం చేసిన స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ సిబ్బంది...





మనగళం శ్రీశైలం : అక్టోబర్ 16వ తేదీన నంద్యాల జిల్లాలోని శ్రీశైలంనకు ప్రధాని పర్యటన ఉన్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ గారి ఆదేశాలమేరకు శ్రీశైల క్షేత్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయడం జరుగుతుంది. ఇది 24/7 కొనసాగుతుంది. స్పెషల్ పార్టీ సాయుధ బలగాలు శ్రీశైల క్షేత్రం చుట్టుపక్కల గల నల్లమల అడవులలో కూంబింగ్ నిర్వహించడం



జరుగుతుంది. ప్రధాని పర్యటించి ప్రాంతాలలో రోడ్డు మార్గంలయందు రోడ్డు ఓపెనింగ్ పార్టీ సిబ్బంది హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ సహాయంతో మరియు పోలీస్ జాగిలాలతో సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించడం జరుగుతుంది. గుడి పరిసరాలలో ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా గారి ఆధ్వర్యంలో క్యూలైన్లు, భక్తులు వేచి ఉండు కంపార్ట్మెంట్లు, పుష్కరిణి, మాడావీధులు,గుడి పరిసరాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడంతో పాటు వాచ్ టవర్లలో(రూఫ్ టాఫ్ )సిబ్బందిని నియమించి బైనాక్యులర్ ద్వారా నిఘా కట్టుదిట్టం చేయడం జరిగింది. శ్రీశైల క్షేత్రం నందు అన్ని డార్మెంటరీలు,సత్రాలలో బస చేయుచున్న వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు కొత్త వ్యక్తులపై అనుమానాస్పద వ్యక్తులపై అనునిత్యం నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగడం జరుగుతుంది.

బుధవారం
15 - 10 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# పెదవి విప్పిన దీపిక



మన గళం, అయితే ఈ రెండు ప్రాజెక్ట్స్ నుంచి తప్పుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం అనేక రూమర్స్ హల్చల్ అయ్యాయి. దీపికా కేవలం 8 గంటలు మాత్రమే పనిచేస్తానని చెప్పడం.. అలాగే అధికంగా రెమ్యునరేషన్ అడిగిందనే ప్రచారం నడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దీపికా ఈ విషయంపై స్పందించింది. వర్కింగ్ అవర్స్ కారణంగా ఆమె భారీ ప్రాజెక్ట్స్ నుంచి తప్పుకున్నారనే వార్తలపై ఆమె పరోక్షంగా స్పందించింది. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీపికా మాట్లాడింది."ఒక మహిళ కావడం.. అది కూడా ఒత్తిడి కలిగించేది.. మరేదైనా అనిపిస్తే అలాగే ఉండకండి. ఒక నటిగా నాకు ఇబ్బంది అనిపిస్తే నేను అంగీకరించను. భారతీయ సినిమా పరిశ్రమలో చాలా మంది సూపర్ స్టార్స్, హీరోలు ఎన్నో సంవత్సరాలుగా 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారు. ఈ విషయం రహస్యం ఏమి కాదు. కానీ అది ఎప్పుడూ వార్తల్లోకి రాలేదు. నేను ఇప్పుడు వారి పేర్లు చెప్పి ఈ విషయాన్ని మార్చాలని అనుకోవడం లేదు. కానీ చాలా మంది హీరోలు రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ ఎనిమిది గంటలు మాత్రమే వర్క్ చేస్తారు. వీకెండ్స్ లో అసలు పనిచేయరు." అంటూ చెప్పుకొచ్చింది దీపిక. అలాగే.. న్యాయంగా పోరాటం చేస్తున్న కారణంగా మీరు ఇబ్బందిపడ్డారా.. అని అడగ్గా.. దీపికా మాట్లాడుతూ.. "ఇది కొత్తేం కాదు. చాలాసార్లు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాను. దీని గురించి ఎలా చెప్పాలనేది నాకు తెలియడం లేదు. ఎన్నో పోరాటాలను నిశ్శబ్దంగానే ఎదుర్కొన్నాను. కానీ కొన్ని కారణాలతో అవి బయటకు వస్తుంటాయి. నేను ఎప్పుడూ వాటిపై స్పందించను. సైలెంట్ గా యుద్ధాలను చేయడం మాత్రమే నాకు తెలుసు. అలా చేస్తేనే గౌరవంగా ఉంటుంది" అంటు చెప్పుకొచ్చారు. ఇటీవలే స్పిరిట్, కల్కి 2 ప్రాజెక్ట్స్ నుంచి తప్పుకుంది. ప్రస్తుతం ఆమె షారుఖ్ ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్ కాంబోలో రాబోతున్న చిత్రంలో నటిస్తుంది. అలాగే అల్లు అర్జున్, అట్లీ సినిమాలో నటిస్తుంది.

# ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన... బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ!



మన గళం, భారీ అంచనాలతో విడుదలైన వార్ 2 సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా విఫలమవడంతో, కియారాకు భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో అనేక అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నట్లు సమాచారం. హృతిక్ రోషన్ ఎన్టీఆర్ మల్టీస్టారర్ గా తెరకెక్కిన వార్ 2 చిత్రం ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదలై మొదటి వీకెండ్ వరకూ చక్కటి కలెక్షన్లను రాబట్టింది. అయితే ఆ తర్వాత కలెక్షన్స్ డ్రాప్ కావడంతో భారీ నష్టాలు మిగిలాయి. ఇదే సమయంలో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ చిత్రం డిజాస్టర్ కావడంతో అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. వార్ 2 విఫలమైన తర్వాత స్పై యూనివర్స్ ప్రాజెక్టులపై మళ్లీ వ్యూహాలు పునః సమీక్షించబడుతున్నాయని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కియారా అద్వానీతో వైఆర్ఎఫ్ మూడు సినిమాల డీల్ చేసినట్లు సమాచారం. స్పై యూనివర్స్ లో ప్రధాన మహిళా పాత్రల కోసం ఆమెను ఎంపిక చేసినప్పటికీ, తాజా ఫలితంతో ఆ కాంట్రాక్ట్ రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వార్ 2 చిత్రంలో కియారా తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కెరీర్‌లో తొలిసారి బికినీ లుక్ లో కనిపించారు. కానీ కథా బలం లేకపోవడంతో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడంలో సినిమా విఫలమైంది. ఫలితంగా కియారాపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల తల్లి అయిన కియారా, ప్రస్తుతం మేటర్నిటీ బ్రేక్ తీసుకున్నారు. ఈ కారణంగా కూడా ఆమె కొత్త సినిమాలకు కొంత విరామం ఇచ్చారు. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, వైఆర్ఎఫ్ సంస్థ స్పై యూనివర్స్‌లో తదుపరి ప్రాజెక్టులకు కొత్త భామలని ఎంపిక చేయాలని చూస్తుందనే టాక్ వినిపిస్తుంది. వార్ 2 పరాజయం తర్వాత బాలీవుడ్ లో హై బడ్జెట్ యాక్షన్ సినిమాలపై మరోసారి సమీక్ష ప్రారంభమైందని తెలుస్తోంది. ప్రేక్షకులు కొత్త కథలు, లోతైన భావోద్వేగాలు కోరుకుంటున్నారు అని నిర్మాతలు విశ్లేషిస్తున్నారు. తారల గ్లామర్ మాత్రమే కాదు, కథకు బలం అవసరం అనే విషయాన్ని ఈ ఫలితం మళ్లీ రుజువు చేసింది. మరి వార్ 2 ఫెయిల్యూర్ కియారాకు ఎంత వరకూ ఇబ్బంది కలిగిస్తుందో వేచి చూడాల్సిందే. అధికారికంగా కాంట్రాక్ట్ గురించి ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ, బాలీవుడ్ బిజినెస్ వర్గాల్లో గుసగుసలు ఊపందుకున్నాయి.

# కాంతారా 1 తర్వాత ట్రెండింగ్‌లో రుక్మిణి వసంత్



మన గళం, : కన్నడ సినిమా కాంతారా చాప్టర్ 1 తో దేశవ్యాప్తంగా పాపులారిటీ తెచ్చుకున్న అందాల ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. ఈ అమ్మడు రీసెంట్ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత అభిరుచుల గురించి షాక్ అయ్యే విషయాలు వెల్లడించారు. సినిమాలో కనకావతి పాత్రలో ఆమె చూపించిన పవర్, సౌత ఆడియన్స్‌కి తెగ నచ్చేసింది. కాంతారా2 తర్వాత రుక్మిణి మరింత ట్రెండింగ్‌లోకి వచ్చింది. అయితే తాజాగా రుక్మిణి మాట్లాడుతూ, నటిగా మారడానికి ముందు మోడలింగ్ చేశానని, అది చూసే నాకు మొదటి సినిమా ఆఫర్ వచ్చింది అని వెల్లడించారు. సప్త సాగరాల దాటి డైరెక్టర్‌కి ఆడిషన్ కోసం మెసేజ్ పంపించాను . అది చూసి ఆడిషన్‌కు పిలిచారు. ఆ మెసేజ్ చూడకపోయి ఉంటే ఆ అవకాశం రావడం ఎంత కష్టమవుతుందో నాకు తెలుసు. ఆ సినిమా తర్వాత చాలా ఆఫర్లు వచ్చాయి అని ఆమె తెలిపారు. అలాగే, సినిమాల్లోకి అడుగు పెట్టాలనే కోరికతో లండన్‌లో థియేటర్ ఆర్ట్స్ చదివినట్లు చెప్పింది. వ్యక్తిగత జీవితంపై రుక్మిణి మాట్లాడుతూ, తండ్రి ఆర్మీలో ప్రాణాలు కోల్పోయిన తర్వాత, చెల్లి కోసం అన్నీ దగ్గర ఉండి చూసారని చెప్పారు. ఆమెకు బుక్‌లు చదవడం అంటే చాలా ఇష్టం . ఎక్కడా షూటింగ్ జరుగుతున్నా దగ్గరలో లైబ్రరీ ఉందా అని వెతకడం, అక్కడకు వెళ్లి చదవడం ద్వారా క్యారెక్టర్స్ లో ఎలా నటించాలో అర్థం చేసుకుంటుందని చెప్పారు. కాంతారా 1 తర్వాత రుక్మిణి పాన్ ఇండియా ఆఫర్లను అందుకుంటున్నారు. సోషల్ మీడియా ఫాలోయింగ్ కూడా విశేషంగా పెరిగింది. ఈ విజయంతో ఆమె భవిష్యత్తులో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. రుక్మిణి వసంత్ ..ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో అవకాశం పొందారు. ఈ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులని పలకరించడమే కాకుండా పాన్ ఇండియా లెవల్‌లో టాప్ రేంజ్ హీరోయిన్‌గా పరిచయం అవుతారని విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో నిఖిల్‌తో స్ట్రైట్ మూవీ చేసిన కూడా, ఇప్పుడు ఎన్టీఆర్ సినిమాతోనే ఆమె టాలీవుడ్ ప్రేక్షకులకి మరింత దగ్గర అవుతుందని అంటున్నారు. రుక్మిణి భవిష్యత్తులో సౌత్ ఇండస్ట్రీలో ప్రముఖ హీరోయిన్‌గా నిలవనుందని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు.



# నక్సలైట్‌గా ఆనంద్‌దేవరకొండ..

మన గళం, బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి.

# డార్లింగ్ పెళ్లి కోసం వెయిట్ చేస్తున్నారా? అయితే అనుష్క మూవీ చూడాల్సిందే!



మన గళం, అనుష్క శెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఇక చాలా రోజుల నుంచి ఈ అమ్మడు చిత్రపరిశ్రమకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. కాగా చాలా గ్యాప్ తర్వాత ఈ బ్యూటీ ఘాటీ సినిమాతో తన అభిమానుల ముందుకు రానుంది. మరీ ఈ మూవీ ముచ్చట్లు కొన్ని తెలుసుకుందాం పదండి!

సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా? డార్లింగ్ పెళ్లి కోసం వెయిట్ చేస్తున్నారా? ఈ రెండు ప్రశ్నలకి ఒకటే జవాబు ఘాటి ట్రైలర్ చూస్తే అర్థమైపోతుంది.. అనుష్క నటించిన ఘాటిలో ఇంతకీ ఏం ఉంది? గ్లామర్ కత్తి పట్టి రపరపలాడిస్తే.. సిల్వర్ స్క్రీన్ మీద నెత్తురోడిస్తే.. విక్టిమ్ క్రిమినల్‌గా మారి లెజెండ్‌గా కనిపిస్తే.. అన్నిటికీ ఒకటే ఆన్సర్ ఘాటి. అనుష్క హీరోయిన్‌గా నటించిన ఘాటి ట్రైలర్ వచ్చేసింది. అనుష్కతో వేదంలాంటి సినిమా చేసిన క్రిష్ జాగర్లమూడి ఈ సారి ఘాటిలో ఏం చెప్పదలచుకున్నారు? చెప్పదలచుకున్న విషయాన్ని మూసిపెట్టి, దాచిపెట్టి ఎందుకు చెప్పడం? ఇదీ కథ అని చెప్పేస్తే పోతుంది కదా అని అనుకున్నట్టున్నారు క్రిష్. ఘాటీ గురించి ఘాటీల ఇబ్బందుల గురించి, ఘాటీ లెజెండ్‌గా మారిన విషయం గురించి, ఎదుర్కొన్న అన్యాయాల గురించి, వాళ్ల జీవితాల్లో కష్టసుఖాల గురించి ట్రైలర్‌లో పూసగుచ్చినట్టు చెప్పేశారు. పనిలో పనిగా సెప్టెంబర్ 5న వచ్చేస్తున్నామంటూ రిలీజ్ డేట్ కూడా ఇచ్చేశారు మేకర్స్. డార్లింగ్ పెళ్లెప్పుడు? అని అంటే.. వెయిటింగ్ అనే డైలాగ్ ట్రైలర్‌లో ఎక్స్ ట్రా అట్రాక్షన్‌గా ఉంది. స్వీటీ సినిమా కోసం చాన్నాళ్లుగా వెయిట్ చేస్తున్న ఫ్యాన్స్ మాత్రం ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ కీ, లుక్స్ కీ, పెర్ఫార్మెన్స్ కీ ఫిదా అవుతున్నారు. సినిమా బ్లాక్ బస్టర్ ఖాయం అంటూ ఆనందపడిపోతున్నారు.

# భాజపా చీఫ్ కు ఘన స్వాగతం







(మన గళం,కర్నూలు రూరల్) : రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పీ.వీ.ఎన్.మాధవ్ కు ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి మంగళవారం కర్నూలు నగరానికి విచ్చేసిన నేపథ్యంలో ఆయనకు ఏ.పీ.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో జిల్లా భాజపా అధ్యక్షుడు అక్కమ్మతోట రామక్రిష్ణ,భాజపా, బీజేవైఎం నాయకులు చంద్రమౌళి,సునీల్ రెడ్డి, మురళీనాయుడు,లోకేష్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను వారు రాగమయూరి గ్రీన్ హిల్స్ చేరుకుని పరిశీలించారు. ఆపై రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్,మంత్రులు అచ్చెన్నాయుడు,సత్యకుమార్ యాదవ్ తదితరులు ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి,తెలుసుకున్నారు.

# ప్రధాని పర్యటన సందర్భంగా శ్రీశైలం నందు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ డిజిపి గారు....






మనగళం శ్రీశైలం : అక్టోబర్ 16 న భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రముఖ పుణ్యక్షేత్రం జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ గారు భద్రత ఏర్పాట్లు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డిజిపి గారు ప్రధాని పర్యటించే ప్రదేశాలలో హెలిపాడ్,రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్, శివాజీ స్ఫూర్తి కేంద్రం ,గుడి పరిసర ప్రదేశాలు, సేఫ్ హౌస్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిపి గారితో పాటు కర్నూలు రేంజి డిఐజి శ్రీ కోయ ప్రవీణ్ %ఖూా% గారు,ఈగల్ టీం ఐజీ శ్రీ ఆకే. రవికృష్ణ %ఖూా% గారు, నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ %ఖూా% గారు, శ్రీ అదిరాజ్ సింగ్ రాణా %ఖూా% గారు, %ఞూా% ఎం.జావళి గారు, ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ గారు పాల్గొన్నారు.




Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310